ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
బుధవారం 3 సెప్టెంబరు 2025





విమానాశ్రయంలో రాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న గవర్నర్, ఉపముఖ్యమంత్రి

రాష్ట్రపతికి ఘనస్వాగతం

| నేడు తిరుచ్చికి పయనం |

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పర్యటన నిమిత్తం భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం చెన్నై చేరుకున్నారు. ఆమెకు విమానాశ్రయంలో గవర్నర్ ఆర్ఎన్ రవి, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, పలువురు నేతలు, ఉన్నతాధికారులు సాదర స్వాగతం పలికారు. అక్కడి నుంచి నందంబాక్కంలోని ట్రేడ్‌సెంటర్‌లో జరిగిన సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వార్షికోత్సవానికి వెళ్లిన రాష్ట్రపతి.. అక్కడ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ఆర్ఎన్ రవి, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర సాంఘిక సంక్షేమం, మహిళాభివృద్ధి శాఖ మంత్రి గీతా జీవన్, సిటీ యూనియన్ బ్యాంక్ ఛైర్మన్ జి.మహాలింగం, ఎండీ ఎన్.కామకోటి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంకు నిర్వాహకులు రాష్ట్రపతిని సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. అనంతరం గిండిలోని రాజ్‌భవన్‌కు వెళ్లిన రాష్ట్రపతి.. రాత్రికి అక్కడే బస చేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయం, ట్రేడ్‌సెంటర్, రాజ్‌భవన్ వద్ద భారీ భద్రత ఏర్పాటు చేశారు.

నేడు సెంట్రల్ యూనివర్సిటీకి...

రాష్ట్రపతి బుధవారం ఉదయం 10.55 గంటలకు చెన్నై నుండి ప్రత్యేక విమానంలో తిరుచ్చికి బయలుదేరి వెళ్లనున్నారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో తిరువారూరు జిల్లా నీలక్కుడికి మధ్యాహ్నం 12.10 గంటలకు చేరుకుని తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీ దశమ స్నాతకోత్సవంలో పాల్గొంటారు. స్నాతకోత్సవం అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ఆమె హెలికాప్టర్‌లో శ్రీరంగం చేరుకుంటారు. సాయంత్రం 5.20 గంటలకు రంగనాథస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం రోడ్డుమార్గంలో తిరుచ్చి చేరుకోనున్న రాష్ట్రపతి.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాటు చేశారు.



రాష్ట్రపతికి జ్ఞాపిక బహూకరిస్తున్న డాక్టర్ ఎన్.కామకోటి



పెట్టుబడిదారుల సదస్సులో సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పంద పత్రాలతో జర్మన్ కంపెనీల ప్రతినిధులు

జర్మనీకి సరైన జోడీ

మా రాష్ట్రం

- రెండంకెల ఆర్థికాభివృద్ధి సాధించాం
- మీ పెట్టుబడులకు ఢోకా లేదు కదలిరండి
- టీఎన్ రైజింగ్ సదస్సులో సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఆటోమొబైల్, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందిన తమ రాష్ట్రం జర్మనీకి సరైన జోడీ అని ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. జర్మన్లకు, తమిళులకు మధ్య మైత్రి ఈనాటిది కాదని, 18వ శతాబ్దంలోనే ఆత్మీయ సంబంధాలు నెలకొన్నాయని పేర్కొన్నారు. సోమవారం రాత్రి జర్మనీలోని డసెల్‌డోర్ఫ్ నగరంలో 'టీఎన్ రైజింగ్ యూరోప్' పేరుతో నిర్వహించిన పెట్టుబడిదారుల సదస్సులో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలోనే డబుల్ డిజిట్ (ద్విసంఖ్యలో) ఆర్థికాభివృద్ధి సాధించిన ఏకైక రాష్ట్రం తమిళనాడేనని చెప్పారు. 18వ శతాబ్దంలో జర్మన్ దేశానికి చెందిన సీగన్‌బాల్ అనే క్రైస్తవుడు తమిళనాడులో పర్యటించి బైబిల్‌ను తమిళంలో అనువదించి ఆ గ్రంథాలను పంపిణీ చేసి తమిళులతో సంబంధాలను ఏర్పరచుకున్నారని తెలిపారు. జర్మన్ లాగే తమిళనాడు కూడా ప్రాచీన నాగరికతకు ప్రధానంగా ఉందని, ఐదువేల సంవత్సరాల క్రితమే తమిళనాట ఇనుప వస్తువుల ఉపయోగం ఉండేదని, ఇనుప కర్మాగారాలుండేవని ఇటీవలి పురావస్తు తవ్వకాల ద్వారా వెల్లడైందని చెప్పారు. తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేవారికి ఏకగవాక్ష పద్ధతిలో సకల
సదు
పా యూ
లను త్వరితగ
తిన అందిస్తున్నామ
న్నారు. జర్మన్‌లో పారిశ్రామిక సంస్థలు, పారిశ్రామికవేత్తలు తమ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందు రావాలని స్టాలిన్ విజ్ఞప్తి చేశారు.

రూ.7020 కోట్ల పెట్టుబడుల సమీకరణ...

ఈ సదస్సులో స్టాలిన్ సమక్షంలో జర్మన్ దేశానికి చెందిన 23 సంస్థలు తమిళనాట పెట్టుబడులు పెట్టేందుకు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ సదస్సుకు ముందే మరో మూడు ప్రముఖ కంపెనీలు కూడా ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మొత్తం 26 సంస్థలు రూ.7020 కోట్లతో కర్మాగారాలను ప్రారంభించనున్నాయి. ఈ ఫ్యాక్టరీల ద్వారా స్థానిక నిరుద్యోగ యువకులు 15320 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఎన్ఆర్ డబ్ల్యూ గ్లోబల్ సీఈఓ ఫెలిక్స్, జెడ్ఎఫ్ గ్రూప్‌కు చెందిన డాక్టర్ పీటర్, బీఎండబ్ల్యూ డైరెక్టర్ రైనాల్ట్, భారతరాయబారి వివాద్ కాంత్, ప్రభుత్వ కార్యదర్శులు అరుణ్ రాయ్, ధరేస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అన్నాడీఎంకే ప్రభుత్వం వచ్చాక

పరిశ్రమలకు భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

- మదురై సభలో ఈపీఎస్ హామీ

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిశ్రమలకు పూర్తిస్థాయి భద్రత కల్పించనున్నట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి మదురైలో జరిగిన సమావేశంలో హామీ ఇచ్చారు. మక్కలై కాప్పోం-తమిళగత్తై మీట్పోం' అనే నినాదంతో ఈపీఎస్ చేపట్టిన ప్రచారయాత్రలో భాగంగా మంగళవారం మదురైలో ఏర్పాటు చేసిన సమావేశంలో వ్యాపారులు, రైతులు, ఎయిమ్స్ ఆస్పత్రి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు, అసంఘటిత కార్మికులు, చేనేత కార్మికులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో పలువురు ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడును మదురైలో నిర్వహించాలని, దక్షిణ తమిళనాడులో పరిశ్రమల అభివృద్ధికి తోడ్పడాలి తదితర కోరికలతో వినతిపత్రాలను ఈపీఎస్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఈ సమావేశంలో పాల్గొన్న ప్రజల కోరికలు న్యాయమైనవేనని, వీటిని పరిష్కరింపజేయాల్సిన డీఎంకే ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించి గత నాలుగేళ్లుగా మోసం చేస్తోందని ఆరోపించారు. వృత్తులు, రాజకీయాలు వేరని, ఈ సమావేశంలో పాల్గొన్నవారు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని, అయినా పన్నులు చెల్లిస్తున్న ప్రజలందరికీ సమన్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. 2015లో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రాజధాని నగరంలో ప్రపంచ పెట్టుబడిదారుల మహానాడును విజయవంతంగా జరిపించి రూ.2.42 లక్షల కోట్ల పెట్టుబడులను రాబట్టుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత తాను ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో నిర్వహించిన మహానాడు ద్వారా కొత్త పరిశ్రమలను ప్రోత్సహించి పలువురికి ఉపాధి చూపించినట్లు తెలిపారు. డీఎంకే ప్రభుత్వం విదేశీ పెట్టుబడుల పేరుతో ప్రజాధనం వృథా చేస్తోందని, ఈ నాలుగేళ్లలో వచ్చిన పెట్టుబడుల వివరాలపై పలుమార్లు డిమాండ్ చేసినా శ్వేతపత్రాన్ని విడుదల చేయలేదని ఈపీఎస్ వ్యాఖ్యానించారు. ఆలయాల నగరంగా ప్రసిద్ధి చెందిన మదురైలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి పరిచేలా చర్యలు చేపడతామని, పరిశ్రమలకు పూర్తిస్థాయిలో భద్రత కల్పిస్తామని, ఈ అవకాశాన్ని అన్నాడీఎంకేకు ఇచ్చేందుకు రాష్ట్రప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీమంత్రులు పి.వలర్మతి, సెల్లూరు రాజు, ఆర్బీ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నల్లజెండాలతో సముద్రంలో దిగి మహిళలు, జాలర్ల నిరసన దృశ్యాలు

కొక్కీ వలలతో చేపల వేటా?

- తక్షణం నిలిపేయాల్సిందే
- మైలాడుదురైలో జాలర్ల వినూత్న ధర్నా



ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మైలాడుదురై జిల్లాలో కొక్కీల వలలతో చేపలవేట నిషేధించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం నల్లజెండాలతో జాలర్ల కుటుంబాలు సముద్రంలో దిగి వినూత్న నిరసన తెలిపాయి. ఈ ప్రాంతంలో ఐదు వేల మందికి పైగా ఫైబర్ పడవలు, 700లకు పైగా మరపడవలతో సముద్రంలో చేపలవేటకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో, తమిళనాడు ప్రభుత్వ చేపలవేట క్రమశిక్షణ చట్టం 1983 నిబంధనలు ఉల్లంఘించి, ప్రభుత్వం రద్దుచేసిన కొక్కీల వల, అతివేగ హార్స్ పవర్ కలిగిన ఇంజన్లను ఉపయోగించి పూంపుహార్, చంద్రబాడి గ్రామాల ప్రజలు చేపలవేటకు వెళ్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలంటూ స్థానిక జాలర్లు మత్స్యశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఆగ్రహించిన తరగంబాడి జాలర్లు.. మంగళవారం సముద్ర తీరంలో నిలబడి నల్లజెండాలతో నిరసన తెలిపారు. తమ పడవలు, నివాసాలపైనా నల్ల జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ... నిబంధనలు అతిక్రమించి చేపలు పట్టడం వల్ల సముద్ర సంపద తరిగిపోతుందని, నష్టపోతున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

- 'టెట్' అర్హత పరీక్ష వ్యవహారం ....

సుప్రీం తీర్పుతో 1.5 లక్షల మంది ఉపాధ్యాయులకు చిక్కులు?

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల్లో కొనసాగాలన్నా, పదోన్నతులు పొందాలన్నా 'ఉపాధ్యాయుల అర్హత పరీక్ష (టెట్)' తప్పనిసరి అంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో, రాష్ట్రంలో పనిచేస్తున్న 1.5 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. సుప్రీంకోర్టు తీర్పుపై తమిళనాడు ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు త్యాగరాజన్ మాట్లాడుతూ... 1 నుంచి 14 ఏళ్ల పిల్లల కోసం కేంద్ర ప్రభుత్వ నిర్బంధ విద్యా చట్టం అమలుచేసిందన్నారు. ఈ పథకంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేరే సెకండరీ, డిగ్రీ టీచర్లకు అర్హత పరీక్ష తప్పనిసరి చేశారన్నారు. కానీ, చట్టంలో లేని ఓ అంశాన్ని చేర్చి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు తీర్పు ఇవ్వడం దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. చట్టం అమలుకాక ముందు పనిలో చేరిన వారికి కూడా టెట్ తప్పనిసరి అని చెప్పడం అంగీకరించలేమన్నారు. అందువల్ల ఈ తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీలుకు వెళ్లాలని కోరారు. ఈ చట్టం పీజీ టీచర్లకు వర్తించదన్నారు. తమిళనాడు వరకు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 62,979 మంది ఉపాధ్యాయులు, మాధ్యమిక పాఠశాలల్లో 49,547 మంది, ఉన్నత పాఠశాలల్లో 31,531 మంది, మహోన్నత పాఠశాలల్లో 82,033 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ఆ ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 2,28,990 మంది ఉపాధ్యాయులు, ఎయిడెడ్ పాఠశాలల్లో 76,360 మంది ఉపాధ్యాయులు మొత్తం 3,05,350 మంది ఉపాధ్యాయులున్నారని తెలిపారు. వారిలో 75,000 మంది పీజీ టీచర్లున్నారని, ఐదేళ్లలోపు పదవీ విరమణ చేసే వారు 50వేల మంది ఉన్నారన్నారు. మరో 35వేల మంది ఇప్పటికే టెట్‌లో ఉత్తీర్ణులైనట్టు తెలిపారు. ఈ మూడు కేటగిరీలో తీసివేస్తే, సుమారు 1.45 లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ రాయాల్సి ఉందన్నారు. అలాగే, ప్రైవేటు పాఠశాలల్లో 1.57 లక్షల మంది తప్పనిసరిగా టెట్ రాయాల్సి ఉంటుందని త్యాగరాజన్ వివరించారు.

ఆందోళన వద్దు: మంత్రి అన్బిల్ మహేష్



ఉపాధ్యాయుల పోస్టులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఎవరూ ఆందోళన చెందవద్దని, ఉపాధ్యాయులను ప్రభుత్వం విడిచిపెట్టదని పాఠశాల విద్యాశాఖ అన్బిల్ మహేష్ భరోసా ఇచ్చారు. తిరుచ్చిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడుతూ... పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి నుంచి అందరు కార్యదర్శులతో చర్చించామని, ఈ తీర్పు పూర్తి వివరాలు అందిన తర్వాత న్యాయ నిపుణులతో సంప్రదించి అప్పీలు పిటిషన్‌పై నిర్ణయం తీసుకుంటామన్నారు. ముఖ్యంగా, ఏ ఉపాధ్యాయుడిని ప్రభుత్వం విడిచిపెట్టదని మంత్రి స్పష్టం చేశారు.

సెంగోట్టయ్యన్ నిర్ణయమేంటో?



చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) పై తీవ్ర అసంతృప్తితో ఉన్న పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ ఆ పార్టీలో కొనసాగడంపై సందేహంగా కనిపిస్తోంది. ఈ వ్యవహారంపై ఈ నెల 5న కీలక నిర్ణయం ప్రకటించనున్నట్లు మంగళవారం ఉదయం ఆయన మీడియా సమావేశంలో వెల్లడించారు. అత్తికడవు - అవినాశి పథకం లబ్ధిదారులైన రైతులు ఆ మధ్య ఈపీఎస్‌కు చేసిన సత్కార సభ వేదికపై మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత ఫొటోలకు తావులేకుండా చేశారని ఆరోపిస్తూ సెంగోట్టయ్యన్ తొలిసారిగా కినుక వహించిన విషయం తెలిసిందే. అప్పటి నుండి ఈపీఎస్‌కు సెంగోట్టయ్యన్‌కు మధ్య విభేదాలు నెలకొన్నాయి. ఆ తరువాత కూడా ఆయన కొంతకాలం పార్టీ సమావేశాలకు దూరంగా ఉంటూ వచ్చారు. ఈ నేపథ్యంలో ఈపీఎస్ గోపిచెట్టి పాళయం వద్ద తన పర్యటన ప్రారంభించినప్పుడు ఆ కార్యక్రమానికి సెంగోట్టయ్యన్ గైర్హాజరయ్యారు. ఆ కార్యక్రమానికి సంబంధించి సెంగోట్టయ్యన్‌కు ఆహ్వానం పంపలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గోపిచెట్టిపాళయంలో మంగళవారం ఉదయం ఆయన తన నివాసగృహంలో అనుచరులతో సమావేశమయ్యారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ నెల 5న గోపిచెట్టిపాళయంలోని తన కార్యాలయంలో కీలకమైన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. ఒకవేళ సెంగోట్టయ్యన్ అన్నాడీఎంకే నుంచి వైదొలగితే విజయ్ నాయకత్వంలోని తమిళగ వెట్రి కళగంలో చేరే అవకాశాలున్నాయని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఆ దిశగానే సెంగోట్టయ్యన్ వర్గీయులు టీవీకే నేతలతో రహస్యంగా మంతనాలు కూడా సాగిస్తున్నారు.

అమెరికా సుంకాలపై నిరసన

- తిరుప్పూర్‌లో డీఎంకే మిత్రపక్షాల భారీ ధర్నా



పాల్గొన్న ఆందోళనకారులు

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ పరిశ్రమలకు నష్టం వాటిల్లే విధంగా 50శాతం పన్ను విధించిన అమెరికా ప్రభుత్వ వైఖరిపై అధికార డీఎంకే, మిత్రపక్ష పార్టీల ఆధ్వర్యంలో మంగళవారం పరిశ్రమల నగరం తిరుప్పూర్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ధర్నాలో కాంగ్రెస్ మాజీ ఎంపీ తంగబాలు మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తనకున్న అధికారంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలపై కక్షసాధింపు చర్యలు చేపట్టేలా పరిశ్రమలకు 50శాతం పన్ను విధించడం దారుణమన్నారు. అమెరికా ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్రంలో పరిశ్రమలకు పేరొందిన తిరుప్పూర్, ఈరోడ్, విరుదునగర్, కోయంబత్తూరు తదితర పెద్ద నగరాల్లో పరిశ్రమల యజమానులు, కార్మికులు, ఉత్పత్తిదారులు ఆర్థికంగా నష్టపోతున్నారని, అయినప్పటికీ కేంద్రప్రభుత్వం అమెరికాతో చర్చలు జరిపి సుంకాలు తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదని ఆరోపించారు. ఎండీఎంకే నేత వైగో మాట్లాడుతూ, బనియన్ పరిశ్రమలు, అద్దకపు యూనిట్లు, స్పిన్నింగ్ మిల్లులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న లక్షలాది కార్మికుల కుటుంబాలు అమెరికా సుంకాలు విధించడం వల్ల ఉపాధి కోల్పోయి రోడ్డునపడుతున్నారని, వీరికి న్యాయం చేసేలా ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ప్రభుత్వ చొరవచూపాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎంకే ఎంపీ ఎ.రాజా మాట్లాడుతూ, పరిశ్రమలను ప్రోత్సహించేలా ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వ వివిధ పథకాలను అమలుపరుస్తోందని, మరోవైపు పారిశ్రామిక రంగాన్ని ఆధునికీకరించి మరింత అభివృద్ధి పరిచేలా విదేశీ పెట్టుబడులను భారీ స్థాయిలో సీఎం సమీకరిస్తున్నారని, అయితే రాష్ట్రప్రభుత్వానికి చేయూతనిచ్చేందుకు కేంద్రప్రభుత్వం ముందుకు రావడంలేదని ఆరోపించారు. తిరుప్పూర్ రైల్వేస్టేషన్ సమీపంలో నిర్వహించిన ఈ ధర్నాలో డీఎంకే ఎంపీ ఎ.రాజా, తిరుప్పూర్ కార్పొరేషన్ మేయర్ దినేష్‌కుమార్, మాజీమంత్రి సెంథిల్ బాలాజీ, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, డీపీఐ అధ్యక్షుడు తిరుమావళవన్, తమిళనాడు కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు తంగబాలు, ఎంపీలు సుబ్బరాయన్, వెంకటేశన్, మనిదనేయ మక్కల్ కట్చి అధ్యక్షుడు జవాహిరుల్లా, ఇండియన్ ముస్లిమ్ లీగ్ మహ్మద్ అబూబకర్, మనిదనేయ జననాయగ కట్చి అధ్యక్షుడు తమీమున్ అన్సారి, ఎంఎన్ఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తంగవేల్ తదితర పార్టీ నేతలు, ఆ పార్టీల కార్యకర్తలు పాల్గొన్నారు.



ధర్నాలో వైగో, తిరుమావళవన్, జవాహిరుల్లా, తంగబాలు, తమీమున్ అన్సారి తదితరులు

సమాచార దృష్టి

15 వరకు 'ఇగ్నో' దరఖాస్తు గడువు పెంపు

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ జాతీయ దూరవిద్య విశ్వవిద్యాలయం (ఇగ్నో) దరఖాస్తు గడువు ఈ నెల 15వ తేది వరకు పొడిగించినట్లు వర్సిటీ డైరెక్టర్ కె.పన్నీర్‌సెల్వం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం యూజీ, పీజీ, డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులు అందిస్తుంది. ఈ క్రమంలో, వృత్తి విద్య కోర్సుల (సర్టిఫికేట్ కోర్సులు) అడ్మిషన్ల గడువు ఇదివరకే ముగిసిన నేపథ్యంలో, విద్యార్థుల కోరిక మేరకు ఈ నెల 15వ తేది వరకు పొడిగించారు. విద్యార్థులు https://ignouadmission.samarth.edu.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని,మరిన్ని వివరాలకు www.ignou.ac.in అనే వెబ్‌సైట్, 044-26618040 అనే నెంబరు సంప్రదించవచ్చని వర్సిటీ డైరెక్టర్ తెలిపారు.

7 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లోని ఒకటి, రెండు ప్రాంతాల్లో బుధవారం నుంచి 7వ తేది వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ పరిశోధన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమ గాలుల వేగంలో మార్పు కారణంగా ఒకటి, రెండు ప్రాంతాల్లో 40 కి.మీ ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురవనుంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ సాయంత్రం, రాత్రి వేళల్లో ఉరుములతో కూడిన తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

ఆరో సారి నిండిన మేట్టూరు డ్యాం

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కావేరి నది పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా, ఈ ఏడాది మేట్టూరు డ్యాం ఆరో సారి పూర్తి స్థాయిలో నిండింది. మంగళవారం గణాంకాల మేరకు డ్యాంకు 36,985 ఘనపుటడుగుల నీరు చేరుతుండగా, డెల్టా సాగు కోసం 23,300 ఘనపుటడుగులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాం నీటిమట్టం 120 అడుగులు పూర్తిస్థాయికి చేరుకుందని, ఎగువ ప్రాంతాల నుంచి నుంచి వస్తున్న నీటి పరిమాణం పెరిగే అవకాశముండడంతో, డ్యాం భద్రత దృష్ట్యా అదే స్థాయిలో నీటిని విడుదల చేయనున్నామని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

నేడు నగరంలో 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాలు

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో బుధవారం నిర్వహించనున్న 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల వివరాలను జీసీసీ ప్రకటించింది.2వమండలం పరిధిలో మనలి శాంత నక్రృష్ణన్ వీధిలోని వీటీసీ మైదానం, 5వ మండలం సెవెన్‌హిల్స్ సెయింట్ జేవియర్ వీధిలోని చెన్నై కార్పొరేషన్ కమ్యూనిటీ హాలు, 6వ మండలం పటాలం స్ట్రాహన్స్ రోడ్డులోని జీసీసీ జోనల్ కార్యాలయం-6, 8వ మండలం పరిధిలో షెనాయ్ నగర్ 12వ వీధి ఏ బ్లాక్ లోని అమ్మ అరంగం, 9వ మండలలో మైలాపూర్ శాంతోమ్ హైయర్ సెకండరీ స్కూలు ఇండోర్ ఆడిటోరియం, 10వ మండలంలో వెస్ట్ మాంబళం నాగారత్నమ్మాల్ కాలనీలోని ఎస్వీ నాగరాత్నం మ్యారేజ్ హాలు, 11వ మండలంలో నెర్‌కుండ్రం పీహెచ్ రోడ్డులోని వేంగాయ మండి మైదానం, 12వ మండలం పరిధిలో ముగలివాక్కం వీజీఎస్ బృందావన్ గార్డెన్ ఎక్స్‌టెన్షన్‌లోని కమ్యూనిటీ హాలు, 15వ మండలంలో తొరైపాక్కం సీఎల్ మెహతా కాలేజ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీసీసీ విజ్ఞప్తి చేసింది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

అంబత్తూర్: అడయాలంపేట మిల్లీనియం టౌన్ ఫేస్-1 నుంచి 3 వరకు, పడసాలై వీధి, కంబర్ నగర్ 1 నుంచి 4 వీధులు, సీఏఎస్‌ఏ గ్రాండ్, కేజీ కులకరై వీధి, వానగరం రోడ్డు, టీటీ మాథ్యూ రోడ్డు, 200 అడుగుల సర్వీస్ రోడ్డు. **రెడ్‌హిల్స్:** సోతుపెరుంబేడు, కుమరన్ నగర్, సెంగాలయమ్మన్ నగర్, విజయానల్లూర్, సిరునిలయం, పార్థసారథి నగర్, విజయ గార్డెన్. **తిరువాన్మియూర్:** ఇందిరా నగర్ 17 నుంచి 20, 25 నుంచి 20 క్రాస్ వీధులు మరియు మెయిన్ రోడ్డు, కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్, ఎల్బీ రోడ్డు, అనంత అపార్ట్‌మెంట్స్. **తేనాంపేట:** పోయస్ గార్డెన్, టీవీ రోడ్డు, జయమ్మాళ్ రోడ్డు, ఇళంగో రోడ్డు, పోయస్ గార్డన్ రోడ్డు, రాజాకృష్ణ రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, పెరియార్ రోడ్డు, కామరాజర్ రోడ్డు, కామరాజర్ వీధి, సీతమ్మాళ్ కాలని, కేబీ దాసన్ రోడ్డు, భారతియార్ వీధి, భక్తవత్సలం వీధి, అప్పాదురై వీధి, టీటీకే రోడ్డు, కెథడ్రల్ రోడ్డు, జేజే రోడ్డు, పార్థసారది పేట, పార్థసారధి గార్డన్, కేఆర్ రోడ్డు, జార్జి అవెన్యూ, ఎస్ఎస్ఐ రోడ్డు, హెచ్‌డీ రాజా వీధి, ఏఆర్కే కాలని, అన్నాసాలై, వీనస్ కాలని, ముర్రాస్ గేట్ రోడ్డు.

డిగ్రీ టీచర్ల నియామకానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ఉపాధ్యాయులకు సత్వరం నియామక ఉత్తర్వులు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు అనుమతులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ ఉపాధ్యాయుల ఎంపిక ప్రత్యక్ష విధానంలో చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ బోధనేతర సిబ్బంది తరఫున హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. తమకు 2 శాతం రిజర్వేషన్ కేటాయించకుండా నియామకాలు చేపట్టరాదని పిటిషన్‌లో కోరింది. ఈ క్రమంలో, 2,500 డిగ్రీ ఉపాధ్యాయులను ప్రత్యక్ష విధానంలో ఎంపిక చేసిన రాష్ట్ర ప్రభుత్వం, కేసు విచారణ కారణంగా నియామక ఉత్తర్వులు అందించలేదు.

రేపటి నుంచి స్వర్ణ రథం ఊరేగింపు

పెరంబూర్,సెప్టెంబరు2(ఆంధ్రజ్యోతి):తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం నుంచి స్వర్ణ రథం ఊరేగింపు మళ్లీ ప్రారంభం కానుంది. ఈ విషయమై ఆలయ జాయింట్ కమిషనర్ జ్ఞానశేఖరన్ విడుదల చేసిన ప్రకటనలో... తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామిఆలయంలో ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు గిరి ప్రాకారంలో స్వర్ణ రథం ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో చేపట్టిన మరమ్మతుల కారణంగా 2024 జూలై 17 నుంచి స్వర్ణ రథం ఊరేగింపు తాత్కాలికంగా నిలిపివేశారు. గిరి ప్రాకారం చుట్టుపక్కల చేపట్టిన మరమ్మతులు ముగియడంతో, గురువారం నుంచి స్వర్ణ రథం ఊరేగింపు ప్రారంభమవుతుందని ప్రకటనలో తెలిపారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తర్వాతే నెలవారీ రీడింగ్

● మంత్రి శివశంకర్



సమావేశంలో మంత్రులు శివశంకర్, తంగం తెన్నరసు, చెళియన్

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లుఏర్పాటుచేసిన తర్వాతే నెలవారీ విద్యుత్ రీడింగ్ చేపడతామని విద్యుత్ శాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. సచివాలయంలో ఆర్థిక శాఖ మంత్రి తంగం తెన్నరసు, రవాణా, విద్యుత్ శాఖ మంత్రి శివశంకర్, ఉన్నత విద్యాశాఖ మంత్రి కొవి చెళియన్ మంగళవారం సంయుక్తంగా మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ... రాష్ట్రంఆర్థికాభివృద్ధిలో రెండంకెలకు చేరి రికార్డు సృష్టించిందన్నారు. నాలుగన్నరేళ్లలో ప్రభుత్వ రవాణా శాఖకు 3,700 కొత్త బస్సులు కొనుగోలు చేయగా, మరో 2,200 బస్సులు ఆధునికీకరించామని తెలిపారు. దేశానికి మార్గదర్శకంగా తమిళనాడు నిలిచిందన్నారు.ఉత్తర చెన్నైలో రూ.6,158 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని మంత్రులుతెలిపారు. సమావేశంలో ఓ విలేకరి డీఎంకే ఎన్నికల హామీల్లో ఒకటైన నెలవారీ విద్యుత్ మీటరు రీడింగ్ ఈ ఏడాదిలో అమలవుతుందా? అంటూ ప్రశ్నించారు. అందుకు విద్యుత్ శాఖ మంత్రి శివశంకర్ స్పందిస్తూ... స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే పనులు జరుగుతున్నాయని, పనులు పూర్తయిన అనంతరం నెలవారీ విద్యుత్ రీడింగ్ చేపడతామన్నారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత స్మార్ట్ మీటర్లు పూర్తిస్థాయి ఏర్పాటుచేసిన అనంతరం నెలవారీ రీడింగ్ చేపడతామని మంత్రి తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 4 లక్షల మంది విద్యార్థుల చేరిక

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యా సంవత్సరం 4 లక్షల మందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని పాఠశా విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక తక్కువగా ఉందని అన్నామలై పాత గణాంకాల ఆధారంగా మాట్లాడుతున్నారన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం అన్నామలై అభిప్రాయాలను స్వీకరిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సేవా దృక్పథంతో కూడుకున్నవని, పాఠశాలలో నలుగురు విద్యార్థులున్నా భవనం నిర్మించడంతో పాటు ఉపాధ్యాయులను నియమిస్తామని మంత్రి తెలిపారు.

రవాణా కార్మికుల్లో అంటరానితనం

● ప్రజా సంఘాల నిరసన



కెంపనూరు ప్రాంతంలో ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల నిర్వాహకులు, సభ్యులు

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా కెంపనూరు ప్రాంతంలో రాష్ట్ర రవాణా సంస్థ కార్మికులు అంటరానితనాన్ని పాటిస్తున్నారంటూ వివిధ సంస్థలకు చెందిన నిర్వాహకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆ ప్రాంతంలో 21వ నెంబర్ రవాణ సంస్థ బస్సును ఎస్సీఎస్టీలు అధికంగా ఉన్న అన్నానగర్ ప్రాంతంలో నడపకుండా వేరే మార్గంలో నడుపుతున్నారంటూ డీవైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ తదితర సంస్థల నిర్వాహకులు కలెక్టర్ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు.

ఐదు జిల్లాల్లో రూ.38 కోట్లతో పూడికతీత పనులు

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రుతుపవనాల ముందస్తు చర్యల్లో భాగంగా, చెన్నై సహా ఐదు జిల్లాల్లో రూ.38 కోట్లతో పూడికతీత పనులను జలవనరుల శాఖ ప్రారంభించింది. చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు, కడలూరు జిల్లాలు ఈశాన్య రుతుపవన వర్షాలతో తీవ్రంగా దెబ్బతింటున్నాయి. రుతుపవనాల ముందస్తు చర్యలుగా వరద కాలువలు, చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టాలని నిర్ణయించిన ప్రభుత్వం, ఈ ఐదు జిల్లాల్లోని కృష్ణా కాలువ, కొశస్తల, ఆరణి, పాలారు, వెల్లారు, కొల్లిడం, అడయారు, కూవం, బకింగ్‌హమ్ కాలువల్లో పూడికతీత పనులు ప్రారంభించిందని, ఈ పనులు రుతుపవనాలకు ముందే పూర్తిచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఇన్‌ఛార్జి డీజీపీ నియామకంపై హైకోర్టులో పిటిషన్

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇన్‌ఛార్జి డీజీపీగా వెంట్రామన్ నియామకాన్ని వ్యతిరేకిస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. డీజీపీగా పనిచేసిన శంకర్ జివాల్ గత నెల 31న పదవీవిరమణ పొందడంతో ఇన్‌ఛార్జీ డీజీపీగా వెంకట్రామన్‌ను నియమించింది. ఈ నేపథ్యంలో, వెంకట్రామన్ నియామకానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సామాజిక కార్యకర్త హెన్నీ థిబెన్ సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్ త్వరలో విచారణకు రానుంది. ఈ నేపథ్యంలో, ఇన్‌చార్జి డీజీపీగా వెంట్రామన్‌ను నియమించడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టు న్యాయవాది వరదరాజ్ తరుఫున సీనియర్ న్యాయవాది ప్రశాంత్ నటరాజ్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ త్వరలోనే విచారణకు వస్తుందని కోర్టు వర్గాలు తెలిపాయి.

తిరుచ్చి కలెక్టరేట్‌కు బాంబు బెదిరింపు



కలెక్టరేట్‌లో తనిఖీ చేస్తున్న పోలీసులు

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి కలెక్టర్ కార్యాలయంలో బాంబులు పేలుతాయంటూ ఈమెయిల్ రావటంతో పోలీసులు, బాంబ్ స్క్వాడ్ హుటాహుటిన వెళ్ళి క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. కలెక్టర్ కార్యాలయంలో ఉంచిన బాంబులు మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల్లోగా పేలతాయని సుబ్రమణియన్ అనే వ్యక్తి పేరుతో ఈమెయిల్ వచ్చింది. ఈ విషయాన్ని కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్ళి అన్ని గదుల్లో తనిఖీ చేశారు. చివరకు అది ఉత్తుత్తి బెదిరింపేనని తెలుసుకుని ఊరట చెందారు. ఈమెయిల్ పంపిన వ్యక్తి ఆచూకీని కనుగొనేందుకు పోలీసులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారు.

వలస కార్మికుల ఆందోళన... పోలీసులపై రాళ్లదాడి



నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా మీంజూరు సమీపంలోని కాట్టుపళ్లిలో మరణించిన వలస కార్మికుడికి నష్టపరిహారం కోరుతూ కార్మికులు మంగళవారం ఉదయం ఆందోళన చేపట్టారు. ఆందోళనకు అనుమతి లేదన్న పోలీసులపై ఆ కార్మికులు రాళ్లతో దాడికి దిగడం కలకలంరేపింది. కాట్టుపళ్లి ప్రాంతంలో ఉత్తరాది చెందిన కార్మికులు పలు ప్రైవేటు కంపెనీల్లో పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, మీంజూరు సమీపంలోని కాట్టుపళ్లిలోని ఎల్ అండ్ టీ నౌకానిర్మాణ సంస్థలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన అమర్‌ప్రసాద్ అనే వలస కార్మికుడు సోమవారం అర్ధరాత్రి ఇంటిపైకి మెట్లెక్కుతూ కాలుజారి కిందపడి మృతిచెందినట్లు తెలిసింది. సమాచారం తెలిసి అక్కడికి చేరుకున్న కాట్టుపళ్లి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి విచారణ చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం సుమారు వెయ్యి మందికి పైగా వలసకార్మికులు మృతుడి కుటుంబానికి నష్టపరిహారం ప్రకటించాలని కోరుతూ ఆందోళన నిర్వహించారు. ఇందుకు అభ్యంతర తెలిపిన పోలీసులపై రాళ్ల రువ్వడంతో 10 మంది పోలీసులకు గాయాలయ్యాయి. దీనితో ఆందోళనకారులను పొగబాంబులు ప్రయోగించి అక్కడినుండి చెదరగొట్టారు. ఈ ఆందోళన కారణంగా 200 మందికి పైగా పోలీసులు కాట్టుపళ్లి ప్రాంతంలో మోహరించారు. కాగా, రెవెన్యూశాఖ అధికారులు పోలీసులతో కలిసి వలస కార్మికుడి మృతి సంఘటనపై దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ ఎంపీ శ్రీకాంత్ దీక్ష విరమణ



శ్రీకాంత్ సెంథిల్‌కు పండ్ల రసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై

టి.నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి రూ.2152 కోట్ల మేరకు విద్యా నిధులను విడుదల చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన తిరువళ్లూరు ఎంపీ శశికాంత్ సెంథిల్ మంగళవారం దీక్ష విరమించారు. కాంగ్రెస్ జాతీయ కమిటీ నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చేసిన సూచన మేరకు ఆయన ఆందోళన విరమించుకున్నారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై జీహెచ్ లో చికిత్స పొందుతున్న శశికాంత్ సెంథిల్‌కు పండ్లరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. ఈ నెల 29న తిరువళ్లూరు రాజీవ్‌భవన్ వద్ద ఆమరణ దీక్ష ప్రారంభించిన శశికాంత్ సెంథిల్ రెండో రోజు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వైద్యుల సలహా మేరకు జీహెచ్‌లో చేరారు. ఆ సందర్భంగా పలువురు రాజకీయనేతలు పరామర్శించారు. ఆస్పత్రిలో చికిత్సపొందుతూనే ఆయన దీక్ష కొనసాగించారు. ఈ విషయం తెలుసుకున్న రాహుల్‌గాంధీ ఆయనకు ఫోన్ చేసి దీక్ష విరమించమంటూ ఆదేశించారు. ఇదే విధంగా ప్రస్తుతం విదేశీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆందోళన విరమించాలని సూచించారు. దీంతో శశికాంత్ సెంథిల్ మంగళవారం వేకువ జాము ఆందోళనను విరమించుకున్నారు.

మదురై ఆధీనంను వెంటనే తొలగించండి

● విశ్వలింగ తంబురాన్ డిమాండ్



మదురై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న విశ్వలింగ తంబురాన్

టి.నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్న మదురై ఆధీనంను ఆ పదవి నుండి తక్షణమే తొలగించి, తనను నియమించాలని కోరుతూ ఆధీన మఠ శ్రీమద్ విశ్వలింగ తంబురాన్ డిమాండ్ చేశారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. 2018 నుంచి తాను మదురై ఆధీనం మఠం తంబురాన్ (కాబోయే పీఠాధిపతి)గా గురుమహాసన్నిధానం ద్వారా దీక్ష పొంది సేవ చేస్తున్నానని, ప్రస్తుతం 293వ ఆధీనం తంబురాన్‌కు సేవలందిస్తున్నానని, 292వ గురు మహాసన్నిధానం గతంలో జారీ చేసిన ఉత్తర్వు మేరకు ప్రస్తుతమున్న ఆధీనం తర్వాత తననే ఉత్తరాధికారిగా ప్రకటించాల్సి ఉండగా ఆధీనం మరొకరికి ఆ పట్టం కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంలో హిందూ దేవాదాయ శాఖ జోక్యం చేసుకుని ప్రస్తుతం క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్న మదురై ఆధీనంను తొలగించి 292వ గురుమహాసన్నిధానం గతంలో ఇచ్చిన ఉత్తర్వు ప్రకారం తనను ఆధీనంగా నియమించాలని ఆ వినతిపత్రంలో డిమాండ్ చేశారు.

సూపర్ సీఎంగా భావిస్తున్న గవర్నర్

● సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదన

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బిల్లులు బుట్టదాఖలు చేసే అధికారం గవర్నర్‌కు లేదని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. బిల్లులకు అంగీకారం తెలిపే వ్యవహారంపై గవర్నర్‌కు ఉత్తర్వులివ్వాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దాఖలైన రిట్ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు, గత ఏప్రిల్ 8వ తేది తీర్పు వెలువరించింది. అందులో గవర్నర్లకు పంపే బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే, రాష్ట్ర ప్రభుత్వాలు దీనికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయవచ్చని తెలిపింది. ఈ క్రమంలో, సుప్రీంకోర్టు వెలువరించిన అభిప్రాయంపై రాష్ట్రపతి 14 ప్రశ్నలు సంధించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి పీఆర్ కవాయ్, న్యాయమూర్తులు సూర్యకాంత్, విక్రమ్‌నాథ్, పీఎస్ నరసింహ, అతుల్ ఎస్.చంద్రూకర్‌తో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. ఈ వ్యవహారంపై ప్రధాన న్యాయమూర్తి పీఆర్ కవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం మళ్లీ విచారణ చేపట్టింది. ఆ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సంఘ్వి గవర్నర్ తిప్పి పంపే బిల్లులు మళ్లీ నెరవేర్చి పంపించే అధికారం శాసనసభకు ఉంది. పాలన లేదా విధాన మార్పు పేరుతో బిల్లులు నిలిపివేయడం లేదా రద్దు చేసే అధికారం గవర్నర్‌కు లేదు. మంత్రి వర్గ సలహా మేరకు అత్యవసర చట్టాలను ఆమోదించే అధికారం గవర్నర్‌కు ఉంది అంటూ వాదించారు. అనంతరం ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

రద్దీ ప్రాంతాల్లో మాస్కు ధరించండి

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రద్దీ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు మాస్క్ ధరించాలని ఆరోగ్యశాఖ సూచించింది. వాతావరణ మార్పుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగలు ఎండ తీవ్రత, రాత్రి వేళల్లో వర్షం కురుస్తోంది. ఈ కారణంగా చెన్నై సహా పలు జిల్లాల్లో వైరల్ జ్వరాల వ్యాప్తి అధికంగా ఉంది. నగరంలో కూడా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లనొప్పులు తదితర లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య అధికమవుతోంది. ఈ క్రమంలో, ఆరోగ్య శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... వాతావరణ మార్పుల కారణంగా వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, జ్వరాలు నిరోధించేలా ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించింది. వృద్ధులు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు రద్దీ ప్రాంతాలకు వెళ్లొద్దని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే మాస్క్ ధరించాలని పేర్కొంది. ఆ జ్వర లక్షణాలున్న వారు అలసత్వం చూపకుండా సత్వరం ఆసుపత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య శాఖ సూచించింది.

పది మంది జాలర్లకు తలా రూ.1.5 కోట్ల జరిమానా

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులు దాటారని ఆరోపిస్తూ శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసిన పదిమంది రాష్ట్ర జాలర్లకు శ్రీలంక న్యాయస్థానం తలా రూ.1.50 కోట్లు జరిమానా విధించింది. రామనాథపురం జిల్లా పాంబన్ ఫిషింగ్ హార్బర్ నుంచి గత నెల 7వ తేది చేపల వేటకు వెళ్లిన పది మంది జాలర్లు సరిహద్దులు దాటి చేపలుపడుతున్నారంటూ శ్రీలంక నావికా దళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. ఈ 10 మంది జాలర్ల కేసు వెలిచ్చుర కోర్టులో సోమవారం విచారణకు రాగా, ఆ జాలర్లకు తలా రూ.5 కోట్ల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో 18 నెలలు జైలుశిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులతో జాలర్లను వెలికడై జైలుకు తరలించారు. శ్రీలంక కరెన్సీలో రూ.5 కోట్లు జరిమానా అంటే, భారత కరెన్సీలో రూ.1.46 కోట్లు. కోర్టు భారీ జరిమానా విధించడంతో బాధిత జాలర్ల కుటుంబాలు తీవ్ర వేదనకు గురవుతున్నారు. ఈ విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి శ్రీలంక ప్రభుత్వంతో చర్చలు జరిపి జరిమానా రద్దు చేయడంతో పాటు జైళ్లలో ఉన్న జాలర్లను విడిపించాలని బాధిత జాలర్ల కుటుంబాలు, జాలర్ల సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయి.

పెరట్లో గంజాయి సాగు, ఇంట్లో జింకమాంసం

● ఊటీలో వృద్ధుడి అరెస్టు



అరెస్టయిన కన్నన్, అటవీశాఖ అధికారులు

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా ఊటీ సమీపం కీళ్ సేల్తా ప్రాంతంలో ఇంటి పెరట్లో గంజాయి సాగుచేస్తూ, ఇంటి లోపల, ఎండిన జింక మాంసాన్ని దాచిన కన్నన్ (64) అనే వృద్ధుడిని అటవీ శాఖ అధికారులు అరెస్టు చేశారు. ఆ వృద్ధుడి ఇంటి చుట్టుపక్కల నివసిస్తున్నవారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీల్ సేల్తా ప్రాంతంలోని ఇంటి వద్ద అటవీ శాఖ అధికారులు మంగళవారం ఉదయం ఆకస్మిక తనిఖీలు జరిపారు. ఆ ఇంటి పెరట్లో సాగవుతున్న గంజాయి కనుగొన్నారు. ఇంటిలోపల సోదా చేయగా, ఓ గోనె సంచిలో ఉన్న ఎండిన జింక మాంసం, ఎముకలు, 300 గ్రాముల గంజాయి పట్టుబడింది. వెంటనే కన్నన్‌ను అరెస్టు చేసి తెన్నాడుకెంపై పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ప్రార్థనా స్థలం మీదుగా విగ్రహం ఊరేగింపు

● 53 మందిపై కేసు

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రిప్లికేన్‌లో నిబంధనలు అతిక్రమించి మసీదు మార్గంగా వినాయక విగ్రహ నిమజ్జన ఊరేగింపు చేసిన వ్యవహారంలో హిందూ మున్నని నిర్వాహకులు మనలి మనోహర్, నటుడు కనల్‌కన్నన్ సహా 53 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు. వినాయక చవితి సందర్భంగా హిందూ సంస్థలు, ప్రజలు తమ తమ వీధుల్లో వినాయకుడు విగ్రహాలు ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. పోలీసుల నిబంధనల మేరకు నగరం, శివారు ప్రాంతాల్లోని సముద్రతీరాల్లో గత ఆదివారం విగ్రహాలు నిమజ్జనం చేశారు. ఈ క్రమంలో, హిందు మున్నని నిర్వాహకులు మనోహరన్, నటుడు కనల్‌కన్నన్ సహా 53 మంది అనుమతించిన మార్గంలో విగ్రహాన్ని ఊరేగించకుండా, మసీదు మార్గం మీదుగా ఊరేగింపుకు తీసుకెళ్లేందుకు యత్నించగా, పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన జామ్ బజార్ పోలీసులు, రెండు సెక్షన్ల కింద 53 మందిపై కేసు నమోదుచేశారు.

రూ.12.5 కోట్ల విలువైన పొగాకు ఉత్పత్తుల ధ్వంసం



సిగరెట్లను దగ్ధం చేస్తున్న ఉద్యోగులు

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విదేశాల నుంచి చెన్నైకి అక్రమంగా దిగుమతైన రూ.12.5 కోట్ల నిషేధిత పొగాకు ఉత్పత్తులను గుమ్మిడిపూండి వద్ద ధ్వంసం చేశారు. భారత ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను తీసుకురావడం చట్టరీత్యా నేరం. అయితే విదేశాల నుంచి అక్రమంగా తరలివచ్చిన పొగాకు ఉత్పత్తులను కస్టమ్స్ అధికారులు గత నెల 25న స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఎన్‌జీవో ప్రతినిధి సమక్షంలో నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ధ్వంసం చేశారు.

మహిళా అధికారితో వాగ్వాదం

● వీఆర్‌కు అసిస్టెంట్ కమిషనర్

పెరంబూర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రించాలని ఆదేశించిన డిప్యూటీ కమిషనర్‌తో వాగ్వివాదానికి దిగిన కోయంబేడు అసిస్టెంట్ కమిషనర్ శరవణన్‌ను వీఆర్‌కు పంపించారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము మంగళవారం నందంబాక్కంలోని సిటీ యూనియన్ బ్యాంక్ 120వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రపతి వచ్చే సమయంలో నందంబాక్కంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరించాలని డిప్యూటీ కమిషనర్ దిషామిట్టల్ అధికారులకు ఆదేశించారు. ఆ సమయంలో దిషా మిట్టల్‌తో కోయంబేడు అసిస్టెంట్ కమిషనర్ వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. దీంతో, కోయంబేడు అసిస్టెంట్ కమిషనర్ శరవణన్‌ను పోలీసు శాఖ వీఆర్‌కు పంపింది.

లాటరీ టిక్కెట్ల విక్రేతల అరెస్టు

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక విరుగంబాక్కంలో రాష్ట్రప్రభుత్వం నిషేధించిన లాటరీ టికెట్లను విక్రయించిన ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుండి ఐదు సెల్‌ఫోన్లు, రూ.4,760 నగదు, లాటరీ టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. విరుగంబాక్కం ప్రాంతంలోని దుకాణాల్లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన పోలీసులు అనుమానంతో ఓ బడ్డీకొట్టుపై నిఘా వేశారు. పొరుగురాష్ట్రాల లాటరీ టికెట్ల నెంబర్లను కాగితంపై రాసిఇచ్చి సెల్‌ఫోన్ ద్వారా ఫలితాలు చూసి వ్యాపారం చేయడంతో పాటు లాటరీ టికెట్లు విక్రయించడాన్ని పసిగట్టారు. దీంతో ప్రభాకరన్ (48), అరుణ్ కుమార్ (37) యాకోబు (41) అనే వారిని అరెస్టు చేసి వారినుండి లాటరీ టికెట్లను స్వాధీనం చేసుకుని, కోర్టు ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.

అన్నానగర్‌లో... : అన్నానగర్ ప్రాంతంలో ద్విచక్రవాహనంలో తరలిస్తున్న 11 కిలోల గుట్కా, మావా, పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్న పోలీసులు శంకర్ (54) అనే వ్యాపారిని అరెస్టు చేశారు. సోమవారం అన్నానగర్ రౌండ్ తానా వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి ద్విచక్రవాహనంలో అనుమానాస్పదంగా రావడంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. రాష్ట్రంలో నిషేధించిన 11.4 కిలోల గుట్కా, పొగాకు వస్తువులతో పాటు ద్విచక్రవాహనం సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు పట్టుబడిన శంకర్‌ను రిమాండ్‌కు తరలించారు.

నవంబర్‌లోగా కూత్తంబాక్కం సబర్బన్ బస్ టెర్మినల్ సిద్ధం

● మంత్రులు శేఖర్‌బాబు , నాజర్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రులు

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా కూత్తంబాక్కం వద్ద నిర్మిస్తున్న సబర్బన్ బస్ టెర్మినల్‌ను నవంబర్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించనున్నారని సీఎండీఏ ఇన్‌ఛార్జి మంత్రి పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. మంగళవారం ఉదయం మంత్రులు శేఖర్‌బాబు, ఎస్ఎం నాజర్ అధికారులతో కలిసి ఆ బస్ టెర్మినల్ నిర్మాణ పనులను పరిశీలించారు. బస్‌టెర్మినల్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి శేఖర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ కూత్తంబాక్కం బస్ టెర్మినల్ నుంచి రోజూ 300 ఎంటీసీ బస్సులు, 600 ఎస్ఈటీసీ బస్సులు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 36 బస్సులు నడపనున్నట్లు తెలిపారు.

అట్టహాసంగా సుందరేశ్వరుడి పట్టాభిషేకం


సర్వాలంకరణతో సుందరేశ్వర స్వామివారు

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మదురై మీనాక్షి అమ్మవారి ఆలయంలో ఆవణిమూల ఉత్సవాల్లో భాగంగా సుందరేశ్వర స్వామివారి పట్టాభిషేకమహోత్సవం నేత్ర పర్వంగా జరిగింది. మీనాక్షి అమ్మవారి ఆలయంలో ప్రతి యేటా పన్నెండూ మాసాలు వివిధ ఉత్సవాలు జరుగుతుంటాయి. వీటిలో చిత్తిరై మాసోత్సవాలు, ఆడిమూలకొట్టువిళా, ఆవణి మూల ఉత్సవాలు, ఐప్పసి నవరాత్రి ఉత్సవాలు ముఖ్యమైనవి. పరమేశ్వరుడు మదురై నగరంలో నిర్వహించిన 64 లీలా విశేషాల్లో 12 విశేషాలను తెలిపేలా ఆవణి మూల ఉత్సవాల్లో స్వామివారిని అలంకరించటం విశేషం. చిత్తిరై వేడుకల్లో మీనాక్షి అమ్మవారు, ఆవణి మూల ఉత్సవాల్లో సుందరేశ్వరస్వామివారు పట్టాభిషిక్తులవుతుంటారు. ఈ యేడాది ఆవణి మూల ఉత్సవాలు ఆగస్టు 26న ప్రారంభమయ్యాయి. ఏడో రోజైన సోమవారం ఉదయం పరమేశ్వరుడు గాజుల అమ్మే లీలా విశేష వైభవం చాటేలా ప్రత్యేక అలంకరణతో ఊరేగారు. ప్రధానఘట్టంగా సుందరేశ్వర స్వామివారి పట్టాభిషేక మహోత్సవం సోమవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. సన్నిధి ఆరుకాళ్ల పీఠంపై మీనాక్షీ సుందరేశ్వరులు సర్వాలంకరణ శోభితంగా ఆసీనులయ్యారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామివారికి రాయలవారి కిరీటాన్ని ధరింపజేశారు. నవరత్నాలు పొదిగిన సెంగోల్‌ని స్వామివారి హస్తంలో ఉంచి ఆలయ ప్రధానార్చకులు, శైవపండితులు పట్టాభిషేక మహోత్సవాన్ని జరిపారు. అనంతరం సుందరేశ్వరర్ స్వామివారి చేతిలోని సెంగోల్‌ను ఆ స్వామివారి ప్రతినిధిగా ఆలయ ట్రస్టుబోర్డు అధ్యక్షురాలు రుక్మిణి పళనివేల్‌రాజన్ స్వీకరించి ఆలయ ద్వితీయ ప్రాకారంలో ఆ సెంగోల్‌ని ఊరేగించి, తిరిగి స్వామివారి చేతికి అందజేశారు. మదురై నగరాన్ని మీనాక్షి అమ్మవారు చిత్తిరై నుండి ఆడి మాసం వరకు (ఆరుమాసాల దాకా), సుందరేశ్వరర్ స్వామివారు ఆవణి నుంచి పంగుణి మాసం వరకు (ఆరుమాసాలపాటు) పరిపాలిస్తారన్నది ఐతిహ్యం. ఆ మేరకే మదురై నగరంలో సుందరేశ్వరుడి పాలన సోమవారం రాత్రి నుండి ప్రారంభమైనట్లు శైవ పండితులు ప్రకటించారు.

చెన్నైలో 'పెప్స్' ప్రత్యేక స్టోర్


స్టోర్ ప్రారంభోత్సవ దృశ్యం

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రముఖ స్లీప్ సొల్యూషన్స్ బ్రాండ్ అయిన 'పెప్స్ ఇండస్ట్రీస్' వనయూరులో ప్రత్యేక స్టోర్ ఏర్పాటు చేసింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.శంకర్ రామ్ దీనిని ఇటీవల లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తమ సంస్థలో ప్రపంచ స్థాయి నిద్ర పరిష్కారాలను వినియోగదారులకు దగ్గరగా తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. చెన్నైలో తమ కొత్త ఉత్పత్తి శ్రేణి ప్రారంభించడం సంతోషదాయమన్నారు. తమిళనాడు తమకు ఎల్లప్పుడూ కీలకమైన వృద్ధి మార్కెట్‌గా వుందని వివరించారు.

హాలీవుడ్ స్థాయిలో 'మిరాయ్'

చిత్రజ్యోతి

● తేజ సజ్జా

తాను హీరోగా నటించిన 'మిరాయ్' చిత్రాన్ని హాలీవుడ్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించామని, ఇందులో హైస్పీడ్ యాక్షన్ సన్నివేశాలుంటాయని హీరో తేజ సజ్జా అన్నారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రంలో తేజ సజ్జాతో పాటు మంజు మనోజ్, జగపతి బాబు, శ్రియ శరణ్, జయరామ్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించగా, ఈ నెల 12న పాన్ ఇండియా మూవీగా విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలో చిత్ర బృందం మీడియా సమావేశాన్ని ఏర్పాటుచేసింది. ఇందులో తేజ సజ్జా మాట్లాడుతూ, 'ఈ మూవీ యాక్షన్, సాహసం, ఫాంటసీ, ఎమోషనల్, డివోషనల్ ఇలా అన్ని అంశాలు పుష్కలంగా ఉన్న చిత్రం. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీలో నాకు ఇది రెండో చిత్రం. మున్ముందు మరిన్ని చిత్రాలను ఆ బ్యానర్‌లో చేయాలని ఉంది. ఈ సినిమా దర్శకుడు కార్తీక్ వల్లే సాధ్యమైంది. 'మిరాయ్' అంటే భవిష్యత్ కోసం ఆశ అనే అర్థం. దీనికి మరో అర్థం కూడా ఉంది. అది సినిమాలో ఓ ట్విస్ట్ ద్వారా తెలుసుకుంటారు. నేను ఫాంటసీ చిత్రాల్లో నటించడానికి ప్రధాన కారణం నాలోని పిల్లతనం ఇంకా పోలేదు. పైగా ఫాంటసీ చిత్రాలు చూడటం అమితమైన ఇష్టం. వెండితెరపై జరిగేవి రియాలిటీలో జరగాలని కోరుకుంటాను. రియాలిటీలో సాధ్యం కానందునే సినిమాల్లో అలాంటి సినిమాల్లో నటిస్తున్నాను. ఇందులో రెగ్యులర్ ఫైట్ సీక్వెన్స్‌లు కాకుండా హైస్పీడ్ ఫైట్ సీక్వెన్స్‌లను రూపొందించడానికి ప్రయత్నించాం. దీని కోసం 20 రోజుల పాటు శిక్షణ తీసుకున్నాను. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్ళేందుకు వీలుగా హిమాలయ, శ్రీలంక వంటి పలు ప్రాంతాల్లో చిత్రీకరణ చేపట్టాం. కుటుంబ సభ్యులంతా కలిసి వచ్చి సినిమా చూసి ఆదరించాలి' అని కోరారు.


మీడియా సమావేశంలో తేజ సజ్జా, అర్చన

ఆ ఇద్దరితో ఓ సినిమా తీయాలనివుంది

● కేఎస్ రవికుమార్


కేఎస్ రవికుమార్, రజనీకాంత్

సూపర్‌స్టార్ రజనీకాంత్, అగ్ర నటుడు కమల్ హాసన్‌ను ఒకే ఫ్రేమ్‌లో చూపిస్తూ సినిమా తీయాలని ఉందని ప్రముఖ సీనియర్ దర్శకుడు కేఎస్ రవికుమార్ తన మనసులోని మాటను వెల్లడించారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, 'ఇపుడు నా దగ్గర చాలా కథలున్నాయి. ముఖ్యంగా రజనీకాంత్, కమల్‌తో కలిపి ఒక చిత్రాన్ని నిర్మించేందుకు నేను సిద్ధంగా ఉన్నాను' అని వెల్లడించారు. కాగా, గతంలో రజనీకాంత్ హీరోగా కేఎస్ రవి కుమార్ 'ముత్తు', 'పడైయప్పా' వంటి సూపర్ హిట్ చిత్రాలను అందించారు. అలాగే, కమల్ హాసన్ కథానాయకుడుగా 'తెనాలి', 'అవ్వై షణ్ముఖి', 'దశావతారం' వంటి విజయవంతమైన సినిమాలను రూపొందించారు. ఈ నేపథ్యంలో 'పడైయప్పా' మూవీ రిలీజై 27 యేళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేయనున్నట్టు కేఎస్ రవికుమార్ వెల్లడించారు.

కాంచన-4లో రష్మిక మందన్నా

రాఘవ లారెన్స్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న 'కాంచన-4' మూవీలోని ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాల కోసం హీరోయిన్ రష్మికా మందన్నాను ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ఇప్పటికే చెన్నై, పొల్లాచ్చి ప్రాంతాల్లో కొంతమేర ఈ మూవీ చిత్రీకరణ పూర్తి చేసుకుంది. తదుపరి షెడ్యూల్‌ను 30 రోజుల పాటు పుదుచ్చేరిలో చిత్రీకరించాలని భావిస్తున్నారు. ఇక్కడ సినిమాకు అత్యంత ప్రధానమైన సీరియస్‌తో కూడిన ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను చిత్రీకరించాల్సి ఉండగా, ఇందులో నటించేందుకు రష్మికా మందన్నాతో ఒప్పందం కుదుర్చుకున్నట్టు సమాచారం. ఇందుకోసం రష్మికకు భారీ మొత్తాన్నే చెల్లించినట్టు తెలుస్తోంది. కాగా, గోల్డ్ మైనస్ పతాకంపై నిర్మాత మణి షా నిర్మిస్తున్నారు. ఇందులో పూజా హెగ్డే ప్రధాన హీరోయిన్‌గా, మరో పాత్రలో బాలీవుడ్ నటి నోరా ఫతేహి నటిస్తున్న విషయం తెల్సిందే.



అర్జున్ దాస్ హీరోగా 'బాంబ్'


'బాంబ్' మూవీ లుక్

అర్జున్ దాస్ హీరోగా నటించిన తాజా చిత్రం 'బాంబ్'. కాళి వెంకట్, శివాత్మిక రాజశేఖర్, నాజర్, అభిరామి, సింగంపులి, బాల శరవణన్ తదితరులు నటించారు. 'సిల నేరంగలిల్ సిల మనిదర్‌గల్' అనే చిత్రానికి దర్శకత్వం వహించిన విశాల్ వెంకట్ దర్శకత్వంలో దీనిని పూర్తి చేశారు. సుధా సుకుమార్, సుకుమార్ బాలకృష్ణన్ నిర్మాతలుగా జెంబ్రియో పిక్చర్స్ పతాకంపై తెరకెక్కించారు. ఈ చిత్రం ఆడియో రిలీజ్ వేడుక నగరంలో తాజాగా జరిగింది. ఇందులో నటుడు మణికంఠన్, దర్శకుడు అధిక్ రవిచంద్రన్, వసంత్ బాలన్, శ్రీ గణేష్, శిబి చక్రవర్తి, వినోద్ రాజ్, గణేష్ కె.బాబు, లోకేష్, ప్రభురామ్, కార్తికేయన్ మణి, నిర్మాత సినిష్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు విశాల్ వెంకట్ మాట్లాడుతూ, ఈ కథ ప్రజల నమ్మకాలపై ఆధారపడి ఉంటుంది. డార్క్ కామెడీ మూవీ. అర్జున్ దాస్, కాళి వెంకట్ స్నేహితులు. వీరిద్దరూ కలిసి రెండు వేర్వేరు గ్రామాలను ఎలా కలిపారన్నదే ఈ చిత్ర కథ అని పేర్కొన్నారు.

అమెరికా పన్ను పోటు... లక్ష ఉద్యోగాల గల్లంతు?

టైలరింగ్ విభాగంలో బూట్లు కుడుతున్న కార్మికులు




షూ ఫ్యాక్టరీలోని ఛాంబర్


షూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న మహిళలు

వేలూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమెరికా అధిక పన్నుల విధించడంతో లక్ష మంది ఉద్యోగులు రోడ్డున పడే ప్రమాదముందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారతదేశం నుండి విదేశాలకు చెప్పులు, షూలకు ఉపయోగించే తోళ్ళ వస్తు సామగ్రి అధికంగా ఎగుమతవుతున్నాయి. విదేశాలకు తోళ్ళను ఎగుమతి చేయడంలో భారత్ 10వ స్థానంలో ఉంది.. ఈ ఎగుమతుల ద్వారా ఏడాదికి రూ.80వేల కోట్లు ఆదాయం వస్తోంది. ఇదిలా వుండగా జాతీయస్థాయిలో తమిళనాడులోనే అత్యధికంగా తోళ్ల ఉత్పత్తి జరుగుతోంది.. అందులోనూ వేలూరు, రాణిపేట, తిరుపత్తూరు తదితర జిల్లాల నుంచి తోళ్ళ ఉత్పత్తులు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. ఈ మూడు జిల్లాల్లో తోళ్ళ ఉత్పత్తి పరిశ్రమల్లో సుమారు 3.50లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. సేకరించిన తోళ్ళను తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి, ఆంబూరు, వేలూరు జిల్లా పేర్నాంబట్టు, రాణిపేట, ఆర్కాడు మొదలైన ప్రాంతాల్లోని షూ కంపెనీలు కొనుగోలు చేసి, బూట్లు తయారు చేసి అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్, బెల్జియం, రష్యా, ఇంగ్లాండ్ సహా ఐరోపా ప్రాంతాల్లోని పలు దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఇందులో 75శాతం అమెరికా దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో, భారత్‌పై అమెరికా విధించిన అధిక పన్నుల కారణంగా పలు రకాల ఎగుమతులు నిలిచిపోయాయి. దీని ప్రభావం 'షూ' ఉత్పత్తుల్లో కూడా పడటంతో 50శాతం విధించిన అధిక పన్ను వల్ల తోళ్ళ కర్మాగారాలు అధికమొత్తంలో నష్టపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో నష్టాన్ని భర్తీ చేసేందుకు ఆ కర్మాగారాల యజమాన్యం షూ ఫ్యాక్టరీ, తోళ్ళ ఫ్యాక్టరీల్లో టైలర్లు, తోళ్ళ శుద్ధీకరణ పనులు నిర్వహిస్తున్న కార్మికుల్లో కొంతమందిని తొలగించాలని నిర్ణయించుకున్నాయి. దీనివల్ల వేలూరు, రాణిపేట, తిరుపత్తూరు జిల్లాలోని పనిచేస్తున్న లక్ష మంది కార్మికులు, చర్మకారులు, టైలర్లు రోడ్డున పడేపరిస్థితి నెలకొందని ఆంబూరు తోళ్ళ పరిశ్రమల సంఘం అధ్యక్షుడు యువరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు.


షూ ప్యాక్‌చేస్తున్న మహిళ ఏఐ దృశ్యం

ఘనంగా కేటీసీటీ పాఠశాలల 101వ వార్షికోత్సవం


విద్యార్థినులతో సోలేటి లోకయ్యన్ సుదర్శనం, డాక్టర్ సరస్వతి కర్నాటి తదితరులు

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) నిర్వహణలోని కేటీసీటీ ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల, కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాలల 101వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఎస్‌కేపీసీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ప్రార్థన, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుకల్లో పాఠశాలల గౌరవ కరస్పాండెంట్ సోలేటి లోకయ్యన్ సుదర్శనం స్వాగతోపన్యాసం చేస్తూ ఎస్‌కేపీడీ నిర్వహణలోని విద్యాసంస్థల చరిత్ర వివరించారు. ఈ వందేళ్లలో ఈ పాఠశాలల్లో చదువుకున్న ఎంతో మంది విద్యార్థులు ప్రపంచ దేశాల్లో, దేశంలో ఉన్నత స్థితిలో సమాజానికి సేవలందించారని తెలిపారు. ముఖ్యఅతిథిగా రెడ్‌హిల్స్‌లోని డాక్టర్ అగర్వాల్స్ కంటి ఆస్పత్రి అధికారి డాక్టర్ సరస్వతి కర్నాటి హాజరై క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కేటీసీటీ బాలికల మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.అనిల, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చుక్కా రేవతి వార్షిక నివేదిక వివరించారు. ఎస్‌కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, సీఆర్.కిషోర్‌బాబు, టీఎస్.బద్రినాథ్, ఎడ్యుకేషన్ అడ్వైజర్ జేవీ.రావు, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్, మాజీ ట్రస్టీ ఊరా అంజనేయులు తదితరులు పాల్గొని కేటీసీటీ పాఠశాలల ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కుళిత్తురైలో ఓనం సంబరాలు ప్రారంభం


ఊయలలో ఊగుతున్న ఎమ్మెల్యే తారహై కత్బర్ట్

ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కుళిత్తురైలో మలయాళీల సంప్రదాయ పండుగ ఓనంను ఆహ్వానిస్తూ సోమవారం ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. ఓనం పండుగలో భాగంగా ఈ నెల 5వ తేదీ ఉదయం కుళిత్తురై పోస్టాఫీసు జంక్షన్‌లో అత్తిపూలతో మెగా రంగవల్లిక తీర్చిదిద్దనున్నారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రదేశ్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిఏటా ఓనం పండుగ జరుపుకోవడం ఆనవాయితీ. ఈ వేడుకల్లో కన్నియాకుమారి జిల్లాలో వృత్తిరీత్యా స్థిరపడిన మలయాళీ కుటుంబాలు, అలాగే కేరళ రాష్ట్రం నుండి మలయాళీలు పెద్దసంఖ్యలో పాల్గొంటారు.. ఆ రీతిలో 40వ వార్షికోత్సవ ఓనం పండుగను పురస్కరించుకుని కుళిత్తురై పోస్టాఫీసు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఓనం ఊయల సేవలను కన్నియాకుమారి జిల్లా విలవన్‌కోడ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే తారహై కత్బర్ట్ ప్రారంభించి కాసేపు ఊయలు ఊగారు. ఈ సందర్భంగా చిన్నారుల నుండి పెద్దల వరకు వివిధ రకాల పోటీల్లో పాల్గొన్నారు. 4వ తేదీ కుళిత్తురై వీఎల్‌సీ గ్రౌండులో కేరళ సంప్రదాయ కథాకళి నృత్య కార్యక్రమాలు నిర్వహిస్తారు 5వ తేదీ ఉదయం పోస్టాఫీసు జంక్షన్‌లో అత్తిపూలతో రంగవల్లిక రూపొందిస్తారు. ఇందులో సంప్రదాయ వస్త్రధారణతో మహిళలు పెద్దసంఖ్యలో ఊరేగింపులో పాల్గొంటారు. సాయంత్రం పలు రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొనే స్టార్ మెగాషో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

జీవవైవిధ్య వారసత్వ ప్రదేశంగా ఎలత్తూరు చెరువు



టి.నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా ఎలత్తూరు చెరువును తృతీయ జీవవైవిధ్య వారసత్వ ప్రదేశం (బయోడైవర్సిటీ హెరిటేజ్ సైట్)గా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. జీవవైవిధ్య చట్టం ప్రకారం 2022లో మదురై జిల్లా అరిడాపట్టిని, ఈ ఏడాది మార్చిలో దిండుగల్ జిల్లా కాసంపట్టి ప్రాంతాన్ని జీవవైవిధ్య వారసత్వ ప్రాంతంగా ప్రకటించారు. ఆ కోవలోనే ఈరోడ్ జిల్లాలోని ఎలత్తూరు చెరువు ప్రాంతాన్ని మూడో జీవవైవిధ్య వారసత్వ ప్రాంతంగా అటవీ శాఖ మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్ ప్రకటించారు. రాష్ట్రంలో వన్యమృగాలు, పక్షుల సంతతిని కాపాడే దిశగా ప్రభుత్వం తగు చర్యలు చేపడుతోందని ఎలత్తూరు చెరువు ప్రాంతాన్ని జీవ వైవిధ్య వారసత్వ ప్రదేశంగా ప్రకటించడంతో ఆ ప్రాంతంలోని పక్షుల సంతతిని కంటికి రెప్పలాకాపాడుతామన్నారు. ఈ విషయమై అటవీశాఖ పర్యావరణ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సుప్రియా సాహు మాట్లాడుతూ 37 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఎలత్తూరు చెరువులో వివిధ రకాల స్వదేశీ, విదేశీ పక్షులు సహా సుమారు 5వేలకు పైగా విహంగాలు సంచరిస్తున్నాయని, వాటి సంతానోత్పత్తికి ఈ చెరువు ప్రాంతం అనువుగా ఉందని తెలిపారు. ప్రతియేటా వలసపక్షులు రాకపోకలు అధికంగానే ఉన్నాయని ఆమె వివరించారు.

నేపాల్‌కు రెవెన్యూ శాఖ కార్యదర్శి అముద



టి.నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రెవెన్యూ శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పి. అముద నేపాల్‌కు పయనమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున నేపాల్‌లో జరిగే సదస్సులో పాల్గొనేందుకుగా ఆమె వెళ్లారు. నేపాల్ పర్యటన ముగించుకుని తిరిగొచ్చేంతవరకూ ఆమె నిర్వహిస్తున్న రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖలను పశుసంవర్థక, మత్స్యశాఖ కార్యదర్శి ఎన్. సుబ్బయ్య నిర్వర్తిస్తారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం ఓ ప్రకటన విడుదల చేశారు. నేపాల్ యూనిసెఫ్ సంస్థ ఆధ్వర్యంలో సామాజిక, శిశు సంరక్షణపై నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో అముద రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా పాల్గొంటారని ఆ ప్రకటనలో తెలిపారు.

చదువుకు వయసు అడ్డం కాదు!

● 72 యేళ్ల వయసులో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్


తరగతి గదిలో తోటి విద్యార్థులతో పాఠం వింటున్న సెల్వమణి

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చదువుకు వయస్సు అడ్డంకి కాదు, ఏ వయస్సులోనైనా ఆసక్తి, పట్టుదల ఉంటే చదువుకోవచ్చని మైలాడుదురైకి చెందిన ఓ వృద్ధుడు ఎలుగెత్తి చాటుతున్నారు. కడలూరు జిల్లా వడలూరు ప్రాంతంలో సెల్వమణి (72) అనే వృద్ధుడు నివసిస్తున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. వీరందరికి పెళ్ళిళ్లు జరిగాయి. ప్రస్తుతం భార్యతోపాటు ఉంటున్నారు. ఐటీఐ చదవిన సెల్వమణి నైవేలి బొగ్గు సొరంగంలో పని చేస్తున్నప్పుడు ఎంకామ్, ఎంబీఏ పాసయ్యారు. రిటైర్ అయి పదేళ్లు దాటినా ఆయనకు చదువులపై ఆసక్తి ఏ మాత్రం తగ్గలేదు. మైలాడుదురై జిల్లా కొళ్లిడంమ్‌లో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులో చేరి ప్రస్తుతం సెకెండ్ ఇయర్ చదువుతున్నారు. విద్యార్థులతో సమానంగా యూనిఫామ్ ధరించి పుస్తకాల బ్యాగ్ పట్టుకుని రోజూ కాలేజీకి వెళుతున్నారు. విద్యార్థులంతా ఆయనను 'తాతయ్యా' అని ఆప్యాయంగా పిలుస్తున్నారు. వృద్ధాప్య సమస్యల కారణంగా ఇంటిలో అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు రోజు సపర్యలు చేసిన మీదట ఆయన ఉదయం 9 గంటలకల్లా కాలేజీకి హాజరవుతున్నారు. సాయంత్రం 5 దాకా తరగతులకు హాజరై, మళ్ళీ తన స్వస్థలమైన వడలూరుకు చేరుకుంటారు. ఇంత వయస్సులోనూ చదువుపై ఆయన చూపుతున్న శ్రద్ధకు అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు జోహార్లు అర్పిస్తున్నారు.

93శాతం నిండిన పుళల్ రిజర్వాయర్


సముద్రాన్ని తలపిస్తున్న పుళల్ రిజర్వాయర్



ప్యారీస్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా రెడ్‌హిల్స్ సమీపంలోని పుళల్ రిజర్వాయర్ కృష్ణానదీ జలాల రాకతో క్రమక్రమంగా నిండుతోంది. మంగళవారం ఉదయానికి 93 శాతం నిండి జలకళ సంతరించుకుంది. తిరువళ్లూరు జిల్లాలోని పూండి, చోళవరం, కన్నన్‌కోట కండిగ, చెంబరంబాక్కం రిజర్వాయర్లు రాజధాని నగరవాసుల దాహార్తిని తీరుస్తున్నాయి. వీటిలో గత ఏడాది పుళల్ రిజర్వాయర్ పూర్తిగా నిండటంతో అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. ప్రస్తుతం తెలుగు గంగ కాలువ ద్వారా వస్తున్న కృష్ణానదీ జలాలతో ఈ జలాశయంతో ప్రస్తుతం 3,300 ఘనపుటడుగుల నీరు నిల్వవుంది. ఇక్కడినుండి చెన్నై ప్రజల తాగునీటి అవసరాలకు సెకనుకు 184 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు. 93 శాతం సామర్థ్యంతో 3 టీఎంసీల నీరు నిండిన కారణంగా పుళల్ రిజర్వాయర్ సముద్రాన్ని తలపిస్తోంది.




క్రీడాకారుల కోటాలో ఉద్యోగాలు పొంది, సచివాలయంలో మంగళవారం నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్య మిశ్రా, క్రీడాభివృద్ధి కమిషన్ మెంబర్ సెక్రటరీ జె.మేఘనాథ రెడ్డి తదితరులు.

నవంబరు వరకూ ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): దీపావళి, దసరా సందర్భంగా కొన్ని మార్గాల్లో నడుస్తున్న వారాంతపు ప్రత్యేక రైళ్లను అక్టోబరు నుంచి నవంబరు వరకు పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి నుంచి సాయినగర్ షిరిడీ, నరసాపురం నుంచి తిరువణ్ణామలై మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్లు అక్టోబరు 5 నుంచి నవంబరు 24 వరకు నడుస్తాయి. తిరుపతి నుంచి షిరిడీకి ప్రత్యేక రైలు(07637), షిరిడీ నుంచి తిరుపతికి ప్రత్యేక రైలు(07638) నవంబరు 24 వరకు రాకపోకలు సాగిస్తాయి. నరసాపురం- తిరువణ్ణామలై (07219-07220), హైదరాబాదు- కన్యాకుమారి(07230-07229), కాచిగూడ-మధురై (07191-07192), హైదరాబాదు- కొల్లాం ప్రత్యేక రైళ్లు (07193-07194) రేణిగుంట, తిరుపతి మీదుగా నవంబరు నెలాఖరు వరకు నడుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

సర్వదర్శనానికి 7 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 7 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 11 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.03 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 65,384

తలనీలాలు సమర్పించినవారు: 22,512

పుట్టింది చంద్రగిరి నియోజకవర్గంలోని పులివర్తివారిపల్లెలో. పెరిగిందీ, చదివిందీ మాత్రం చిత్తూరులో. పులివర్తివారిపల్లి సర్పంచుగా చేసినా చిత్తూరు రాజకీయాల మీదే ప్రేమ ఎక్కువ. అనూహ్య పరిస్థితుల్లో చంద్రగిరినే పులివర్తి నాని.. తన రాజకీయ క్షేత్రంగా స్థిరపరచుకోవాల్సి వచ్చింది. టీడీపీలో తొలినుంచీ చురుకైన నేతగా గుర్తింపు పొందారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు తెలుగు యువత అధ్యక్షుడుగా, టీడీపీ అధ్యక్షుడుగా పనిచేశారు. 2018లో చంద్రగిరి టీడీపీ ఇంఛార్జిగా నియమితులయ్యారు. 2019 ఎన్నికల్లో చంద్రగిరి నుంచీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినా జనంలోనే వుండి 2024 ఎన్నికల్లో భారీ ఆధిక్యతతో ఎమ్మెల్యేగా గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టారు. నిరంతరం జనంలో ఉంటూ, వారు చెప్పింది వింటూ, భారీ ప్రతిపాదనలతో చంద్రబాబు, లోకేశ్‌లను కలుస్తుంటారు. నిధుల సులువులెరిగి, సాధించే ప్రయత్నాలు చేస్తుంటారు. తొలి ఏడాదిలో చంద్రగిరి నియోజకవర్గంలో చేసిన, చేయబోతున్న పనుల గురించి ఆంధ్రజ్యోతికి పులివర్తి నాని ఆంధ్రజ్యోతి ప్రతినిధితో పంచుకున్న అంశాలు ఇవి..

కథనం, ఇంటర్వ్యూ
తిరుపతి, ఆంధ్రజ్యోతి





నాడు

పాకాల మండలం నేంద్రగుంట - దామలచెరువు మార్గంలో ఊట్లవారిపల్లి గతంలో రోడ్డు (ఫైల్ ఫోటో)



నేడు

అదే రోడ్డు ఇప్పుడిలా ఉంది

ప్రోగ్రెస్ రిపోర్ట్

1 ఏడాదిలో ఏం చేశారు?

రూ.350 కోట్లతో అభివృద్ధి పరుగులు

చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

- రూ. 75 కోట్లతో తారు, సీసీ రోడ్లు
- రూ. 600 కోట్లతో పనులకు ప్రతిపాదనలు
- పరిశ్రమల కోసం భూముల గుర్తింపు

చెరువులకు 187కోట్లు

చంద్రగిరి నియోజకవర్గంలో ఇరిగేషన్ శాఖ ద్వారా చెరువుల ఆధునీకరణకు, పూడికతీత తదితర అభివృద్ధి పనుల కోసం రూ. 220.13 కోట్లతో 180 పనులు ప్రతిపాదించగా రూ. 187.40 కోట్లతో 63 పనులను ప్రభుత్వం మంజూరు చేసింది. పాకాల మండలంలో రూ. 54 కోట్లు, చంద్రగిరి మండలంలో రూ. 15.60 కోట్లు, చిన్నగొట్టిగల్లు మండలంలో రూ. 24 కోట్లు, ఎర్రావారిపాలెం మండలంలో రూ, 33 కోట్లు, తిరుపతి రూరల్ మండలంలో రూ. 40.80 కోట్లు, రామచంద్రాపురం మండలంలో రూ. 20 కోట్లు చొప్పున ఖర్చు చేశాం.

తొలి ఏడాది చేసినవి ఇవీ..

రూ. 27.10 కోట్లతో వేసిన ఆర్ అండ్ బీ రోడ్లు

- రూ. 8 కోట్లతో వేదాంతపురం నుంచీ రాయలచెరువు కట్టమీదుగా అనుప్పల్లి వరకూ రోడ్డు
- రూ. 1.40 కోట్లతో చంద్రగిరి టవర్ క్లాక్ సెంటర్ నుంచీ శ్రీనివాస మంగాపురం వరకూ.
- రూ. 1.40 కోట్లతో నేంద్రగుంట నుంచీ దామలచెరువు వరకు
- రూ. 6 కోట్లతో భాకరాపేట నుంచీ తలకోన వరకూ 14 కిలోమీటర్లు.
- రూ. 1.60 కోట్లతో పెద్దమల్లెల నుంచీ ఎర్రావారిపాలెం వరకూ 8 కిలోమీటర్లు.
- రూ. 2.40 కోట్లతో పింఛా రోడ్డు నుంచీ ఉస్తికాయలపెంట వరకూ 7 కిలోమీటర్లు.
- రూ. 2 కోట్లతో పాకాల నుంచీ పి.కొత్తకోట వరకూ 5.20 కిలోమీటర్లు
- రూ. 1.30 కోట్లతో భాకరాపేట నుంచీ చట్టేవారిపాలెం, పులికుంట్లవారిపల్లి వరకూ 5.80 కిలోమీటర్లు.
- రూ. 3 కోట్లతో కుప్పం బాదూరు నుంచీ గుండోడు కనం మీదుగా కొత్త నెన్నూరు వరకూ.

రూ. 63.58 కోట్ల ఉపాధి నిధులతో సీసీ రోడ్లు

- రూ. 3.55 కోట్లతో తిరుపతి రూరల్‌లో 38 సీసీ రోడ్లు, ● రూ. 10.28 కోట్లతో పాకాలలో వంద సీసీ రోడ్లు
- రూ. 22.04 కోట్లతో చంద్రగిరిలో 144 సీసీ రోడ్లు, ● రూ. 4.47 కోట్లతో చిన్నగొట్టిగల్లులో 77 సీసీ రోడ్లు
- రూ. 4.27 కోట్లతో ఎర్రావారిపాలెంలో 84 సీసీ రోడ్లు, ● రూ. 3.12 కోట్లతో రామచంద్రాపురంలో 26 సీసీ రోడ్లు

గోకులం షెడ్లు

- రూ. 6.25 కోట్లతో చిన్నగొట్టిగల్లులో 272 షెడ్లు, ● రూ. 5.84 కోట్లతో ఎర్రావారిపాలెంలో 281 షెడ్లు
- రూ. 1.88 కోట్లతో చంద్రగిరిలో 93 షెడ్లు, ● రూ. 1.85 కోట్లతో పశువులకు 451 నీటి తొట్టెలు.

- నియోజకవర్గంలో తాగునీటి సరఫరా కోసం రూ. 35.30 కోట్లతో 538 పనులు మంజూరు చేయించా. అందులో రూ. 12.54 కోట్లతో ఇప్పటి దాకా 493 పనులు పూర్తి అయ్యాయి.
- నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న 98 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచీ రూ. 2.44 కోట్లు సాయంగా అందించాం.
- నియోజకవర్గంలోని మొగరాల, పులివర్తివారి పల్లి, రామచంద్రాపురం, తొండవాడ ఎన్టీయార్ కాలనీల్లో రూ.12 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్లు నిర్మించాం. నెరబైలులో రూ. 2.20 కోట్లతో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయించాం.

మలి ఏడాది లక్ష్యాలు

- చంద్రగిరి శివార్లలో గోవింద ధామం పేరిట ఆధునిక స్మశాన వాటిక ఏర్పాటు చేస్తున్నాం. ఉపాధి హామీ నిధులతో శ్మశానాలకు ప్రహరీలు నిర్మించి ఆక్రమణలు జరగకుండా చూస్తాం.
- దామలచెరువు నుంచీ పాకాలకు సప్లై ఛానెల్ నిర్మాణం పనులు 2026 చివరికి ప్రారంభిస్తాం.
- చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు మండల కేంద్రాల్లో ఇండోర్ స్టేడియంలు నిర్మించాల్సి వుంది. వీటిని ఏడాదికి ఒకటి చొప్పున చేపట్టి పదవీ కాలం పూర్తయ్యే లోపు వాటి నిర్మాణం పూర్తి చేస్తాం. ● పాకాల మండలం పెద్ద చెరువుకు హంద్రీనీవా నీరు రప్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాం. అమోదం కోసం ప్రయత్నిస్తున్నాం.

ప్రతిపాదనలు

1. రాయలచెరువును రిజర్వాయర్‌గా మార్చేందుకు రూ. 150 కోట్లతో ప్రతిపాదనలు
2. తనలకోన జలాలను సాగునీటికి మళ్ళించేందుకు రూ. 27 కోట్లతో ప్రతిపాదనలు
3. ఐతేపల్లి - రంగంపేట మధ్య స్వర్ణముఖిపై రూ. 14.60 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
4. వేదాంతపురం-రాయలచెరువు-పచ్చికాపల్లం రోడ్డులో స్వర్ణముఖిపై రూ. 23.55 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
5. తిరుచానూరు నుంచి తనపల్లి-వెంకటాపురం-చల్లావారిపల్లి రోడ్డులో స్వర్ణముఖిపై రూ. 29.10 కోట్లతో రెండు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం
6. తిరుచానూరు-అప్పలాయగుంట-పూడి రోడ్డులో స్వర్ణముఖిపై రూ.19.90 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం.
7. నేంద్రగుంట-పెనుమూరు డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ. 10 కోట్లతో ప్రతిపాదన
8. దామలచెరువు-మంగళంపేట-పులిచెర్ల మార్గంలో రూ. 16 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం
9. ఎర్రావారిపాలెం నుంచీ ఎల్లమంద క్రాస్ వరకు రూ. 44 కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం.
10. చంద్రగిరి మూలపల్లి ఎస్టీ కాలనీ వద్ద భీమా నదిపై రూ. 1.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం.
11. కొంగరవారిపల్లి -మామిడిమాను గడ్డ మార్గంలో బీమా నదిపై రూ. 2.10 కోట్లతో కాజ్‌వే
12. చంద్రగిరి పీఎస్ రోడ్డు నుంచీ కొత్తపల్లి రోడ్డులో స్వర్ణముఖిపై రూ. 2.50 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం.





పాకాల భారతంమిట్ట వద్ద వేసిన సీసీ రోడ్డు - పాకాల మండలం ఊట్లవారిపల్లి నుంచి సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం వరకూ నిర్మాణంలో ఉన్న డబుల్ రోడ్డు



మండలం తొండవాడ ఎన్టీయార్ కాలనీలో కొత్తగా వేసిన సీసీ రోడ్లు



తొండవాడలో నిర్మించిన సబ్ స్టేషన్

ఎన్నికల హామీలు... వాటి అమలు స్థితి

? ఎమ్మెల్యే గారూ..చంద్రగిరి పర్యాటక అభివృద్ధికి ఆలయాల ఆధారంగా చేస్తానన్న కృషి ఏ దశలో ఉంది?

ఎమ్మెల్యే: తలకోన ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచీ రూ. 18 కోట్లు మంజూరు చేయించా.. పాకాల సుబ్రమణేశ్వరాలయ అభివృద్ధికి రూ. 2.80 కోట్లతో పనులు జరుగుతున్నాయి.

? మల్లవరం-పనబాకం నడుమ ఐటీ కంపెనీల ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే: ఇప్పటికే ఆ ప్రాంతంలో 40 ఎకరాల అనువైన భూమిని గుర్తించాం. ఐటీ కంపెనీలను రప్పించేందుకు ప్రయత్నిస్తున్నా.

? వేదాంతపురం జంక్షన్ నుంచీ రాయలచెరువు వరకూ వంద అడుగుల రోడ్డు నిర్మాస్తామని ఎన్నికల ప్రచార సమయంలో మీరు చెప్పారు.

ఎమ్మెల్యే: మరిచిపోలేదు. వచ్చే ఏడాది ప్రతిపాదనలు పెట్టనున్నాం.

? పాకాల, దామలచెరువులకు బైపాస్ రోడ్లు నిర్మిస్తామని మీరు పలు సందర్భాల్లో హామీ ఇచ్చారు. ఏడాది అయింది.

ఎమ్మెల్యే: మొత్తం 16 కిలోమీటర్ల నిడివికి రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం వద్ద పెండింగులో వున్నాయి. వెంటబడి సాధిస్తాను.

? పాకాల ప్రభుత్వ ఆస్పత్రి 24 గంటలూ పనిచేసేలా స్థాయి పెంచుతామని చెప్పారు.

ఎమ్మెల్యే: దీనిపై ప్రతిపాదనలు పంపాం. మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్ళా.

? పాకాల రైల్వే జంక్షన్‌లో లోడింగ్, అన్ లోడింగ్, పార్శిల్ బుకింగ్ సదుపాయాలు పునరుద్ధరిస్తామని మీరు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే: చిత్తూరు ఎంపీ ద్వారా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాం.

? దామలచెరువులో మ్యాంగోనగర్ విడిగా ఏర్పాటు చేస్తామన్నారు.

ఎమ్మెల్యే: అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపించాం.

? చిన్నగొట్టిగల్లులో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయిస్తామని మీరు ఎన్నికల ప్రచార సమయంలో చెప్పారు.

ఎమ్మెల్యే: శ్రీవెంకటేశ్వర విజ్ఞాన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాం. ఇందుకు 15 ఎకరాలు గుర్తించాం.

? చిన్నగొట్టిగల్లు నుంచి ఎల్లమంద వరకూ డబుల్ రోడ్డు నిర్మిస్తామన్నారు.

ఎమ్మెల్యే: ప్రతిపాదనలు పంపించాం. ముందస్తుగా గ్రావెల్ పనులు చేయించాం.

? ఎర్రావారిపాలెంలో కోల్డ్ స్టోరేజీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని, అర్లపెంట ప్రాజెక్టు పూర్తి చేస్తామని చెప్పారు.

ఎమ్మెల్యే: ప్రైవేటు రంగంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తే ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు అందించి కోల్డ్‌స్టోరేజ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. ఇక అర్లపెంట ప్రాజెక్టు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం.

పాత కార్ల మ్యూజియం సందర్శన

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడుల సమీకరణ దిశగా జర్మనీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ సోమవారం రాత్రి డుసెల్‌డోర్ఫ్ నగరంలో 'క్లాసిక్ రిమైస్' పేరుతో నిర్వహిస్తున్న ప్రాచీన కార్ల ప్రదర్శన సందర్శించారు. ఆ మ్యూజియంలో ప్రపంచంలో తయారైన మొట్టమొదటి కారు, ప్రాచీన రేస్‌కార్ తిలకించారు. ఆ మ్యూజియంలో వందల సంఖ్యలో పాత కార్లను వాటి అందాలు చెక్కుచెదరకుండా కాపాడుకుంటూ వస్తున్నారని స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో ఓ సందేశం పోస్టు చేశారు. ఆ మ్యూజియంలో ఆ కాలం నాటి కార్లను చూస్తూ వెళ్తే వింతైన అనుభూతి కలుగుతుందని పేర్కొన్నారు.



పాతకాలపు కారులో కూర్చుని ఫొటో దిగిన సీఎం



ప్రపంచంలోనే మొట్టమొదటగా తయారైన కారులో కూర్చుని దాని వివరాలు తెలుసుకుంటున్న సీఎం స్టాలిన్

కొడైకెనాల్‌లో డాగ్‌షో

- ఛాంపియన్‌గా నిలిచిన విజయ ప్రభాకరన్ శునకం

చెన్నై, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన ఇంటర్నేషనల్ డాగ్‌షోలో దివంగత సినీనటుడు విజయకాంత్ తనయుడు విజయ ప్రభాకరన్ పెంపుడు శునకం ఛాంపియన్‌గా నిలిచింది. కెన్నల్ క్లబ్, మద్రాస్ కెనైన్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో పలు దేశాలకు చెందిన శునక ప్రియులు తాము పెంచుకుంటున్న శునకాలను పోటీకి తీసుకువచ్చారు. 35 రకాలకు చెందిన 300లకు పైగా శునకాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. విజయ ప్రభాకరన్ పెంచుతున్న ఇంగ్లీష్ షట్టర్ శునకం ఓవరాల్ ఛాంపియన్‌షిప్ గెలుచుకుంది. దీంతో ఆ శునకంతో ఫొటోలు తీసుకునేందుకు ప్రదర్శకులు పోటీపడ్డారు.



ఛాంపియన్‌గా నిలిచిన ఇంగ్లీష్ షట్టర్ శునకంతో విజయ ప్రభాకరన్



చెన్నై రిప్పన్‌భవనం హాలులో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్, స్టెల్లామేరీస్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటైన సైబర్ నేరాల నిరోధక చర్యలపై పాఠశాలల విద్యార్థుల అవగాహన సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న మేయర్ ఆర్.ప్రియ తదితరులు